




TGTEL/25/A31

# నేటి దిక్సూచి

తెలుగు దిన పత్రిక








ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :155 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ గురువారం- 02 - జూలై- 2026


### దొంగలకు శిక్ష పడాలంటే ప్రభుత్వం మారాలి‘

## అయోధ్య విరాళాల చోరీపై కేజ్రీవాల్ ఫైర్




- బీజేపీ నాయకులు రాముడిని దేవుడిగా పరిగణించరని ఆరోపించిన కేజ్రీవాల్
- నిజంగా వాళ్లకు రాముడిపై అభిమానం ఉంటే దొంగతనం చేసేవారు కాదని విమర్శ
- విరాళాలను చోరి చేసిన వారికి క్యాన్సర్ వస్తుందన్న బీజేపీ ఎమ్మెల్యే

ఢిల్లి : అయోధ్య రామజన్మభూమి ఆలయ విరాళాల చోరీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. తాజాగా ఈ విషయంపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్రం, ఉత్తర్ ప్రదేశ్

### విద్యా శాఖ మంత్రిగా లోకేశ్ పనితీరుకు

## రాష్ట్రపతి ప్రశంసలు

- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌పై రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము ప్రశంసలు
- రాష్ట్రంలో విద్యా సంస్కరణలు కొనసాగించాలని సూచన
- అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ స్నాతకోత్సవం అనంతరం ఘటన
- లోకేశ్ ప్రసంగం యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉందని అభినందన



అమరావతి : ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని, వాటిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమం ముగిశాక, రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు మంత్రి లోకేశ్ హెలికాప్టర్ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను తన వద్దకు పిలిచిన రాష్ట్రపతి, విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి కేంద్రంగా సాగుతున్న ఈ సంస్కరణలు మిగతా..2లో

### భారత్, పాక్ మధ్య శాంతి చర్చలు

## పునఃప్రారంభించాలి

**మోదీ, షరీఫ్‌కు 100 మందికిపైగా ప్రముఖుల బహిరంగ లేఖ**

- భారత్, పాకిస్థాన్ ప్రధానులకు 100 మందికిపైగా ప్రముఖుల విజ్ఞప్తి
- భారత్, పాక్ మధ్య శాంతి చర్చలు తిరిగి ప్రారంభించాలని లేఖ
- ఉద్రిక్తతలకు ముగింపు పలకాలని పిలుపు



ఢిల్లి : భారత్– పాకిస్థాన్ మధ్య దౌత్య సంబంధాల్ని పునరుద్ధరించి, ద్వైపాక్షిక చర్చల్ని తిరిగి ప్రారంభించాలని ఇరు దేశాలకు చెందిన దాదాపు 100 మందికిపైగా ప్రముఖులు సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు బహిరంగ లేఖ రాశారు. దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధి కోసం ఘర్షణలకు బదులుగా సంభాషణ, సహకార మార్గాన్ని ఎంచుకోవాలని ఇరు ప్రభుత్వాల్ని కోరారు. మిగతా..2లో

### కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ..

## ఈసీకి 700 ఫిర్యాదులు




- కవిత కొత్త పార్టీ ‘తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్)‘ పేరుపై అభ్యంతరం
- కేంద్ర ఎన్నికల సంఘానికి దాదాపు 700 అభ్యంతరాలు
- ఫిర్యాదు చేసిన వారిలో అత్యధికం బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలే
- అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్న ఈసీ

హైదరాబాద్ : కల్వకుంట్ల కవిత స్థాపించిన నూతన రాజకీయ పార్టీ పేరుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఆమె ప్రతిపాదించిన ‘తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్)‘ పేరుపై కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) దాదాపు

### ఆదాయ సమీకరణపై సీరియస్‌గా ఫోకస్ పెట్టండి..

## అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

- ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.
- రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు
- టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు.



హైదరాబాద్, జులై 1: ఆదాయ సమీకరణపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు. కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలని సూచించారు .(బుధవారం) ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీ(MCRHRD)లో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సమీక్ష నిర్వహించిన సీఎం.. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆదాయ సమీకరణకు సంబంధించి ఛేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా డిపార్ట్‌మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం సూచించారు. టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ ప్రాజెక్టులను, మిగతా..2లో

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను

## స్వీకరించిన కేటీఆర్




- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటన
- తేదీ, సమయం ఖరారు చేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేసిన కేటీఆర్
- ప్రభుత్వ వైఫల్యాలను నిరూపించలేకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని వెల్లడి

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలన, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ చర్చకు సంబంధించిన తేదీ, సమయాన్ని ఖరారు చేయాలని ఆయన ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో

## బంగాళాఖాతంలో అల్పపీడనం... ఏపీలో వారం రోజుల పాటు భారీ వర్షాలు



**ఆంధ్రప్రదేశ్‌లో వారం రోజుల పాటు భారీ వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది.**

విశాఖపట్నం, జులై 1: ఆంధ్రప్రదేశ్‌లో వారం రోజుల పాటు భారీ వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. జులై 3న వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాబోయే వారం రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా ఉత్తర కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అలాగే కోస్తా తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీచే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో మిగతా..2లో

## రికార్డు స్థాయిలో జీఎస్టీ కలెక్షన్స్.. జూన్ నెలలో రూ.1.94 లక్షల కోట్ల ఆదాయం



**దేశంలో వస్తుసేవల పన్ను వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి.**

**ఈ ఏడాది జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1.94 లక్షల కోట్లు దాటింది.**

ఢిల్లి : నేడు విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం.. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే వసూళ్లు 13.9 శాతం పెరిగాయి. ముఖ్యంగా దిగుమతులపై వచ్చే పన్ను రాబడి గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. 2026 జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ. 1,94,812 కోట్లుగా నమోదైంది. గత సంవత్సరం జూన్‌లో ఈ మొత్తం రూ. 1,71,105 కోట్లుగా ఉంది. ఈ పెరుగుదలలో దిగుమతులపై వచ్చే జీఎస్టీ వాటానే అధికం. దిగుమతులపై పన్ను రాబడి ఏకంగా 34.6 శాతం పెరిగి రూ. 60,038 కోట్లకు చేరుకుంది. అయితే దేశీయ లావాదేవీల ద్వారా సమకూరిన జీఎస్టీ ఆదాయం మాత్రం 6.5 శాతం వృద్ధితో రూ. 1,34,774 కోట్లుగా నమోదైంది. దేశీయ వసూళ్ల వృద్ధిరేటు కంటే దిగుమతులపై వసూళ్ల వృద్ధిరేటు ఎక్కువగా ఉండటం గమనార్హం. రిఫండ్‌ల తర్వాత ప్రభుత్వానికి మిగతా..2లో

### బీచ్‌లను కూడా మద్యం

## కేంద్రాలుగా మారుస్తారా?




- బీచ్ షాక్స్ పేరుతో కొత్త మద్యం సంస్కృతికి తెరలేపుతున్నారన్న జగన్
- సామాన్య కుటుంబాలు బీచ్‌లకు ఎలా వెళ్తాయని ఆవేదన
- రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శ

అమరావతి :“కుటుంబాలు, చిన్నారులతో కలిసి ప్రశాంతంగా గడిపే బీచ్‌లను కూడా చంద్రబాబు ప్రభుత్వం వదలడం లేదు. బీచ్ షాక్స్ పేరుతో కొత్త మద్యం సంస్కృతికి తెరలేపుతోంది“

### పెట్టుబడుల్లో దేశంలోనే ఏపీ నెంబర్ 1

## గూడూరులో మెగా ఫర్నిచర్ పార్క్

- గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, జీవితంలో ఆ పార్టీ గెలవకూడదన్న సీఎం చంద్రబాబు
- ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని మరోసారి హెచ్చరించిన సీఎం



అమరావతి: పేదలకు అండగా ఉంటూ సంక్షేమం అందిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. పేదరిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలునిచ్చారు. నెల్లూరు జిల్లా పున్నపువారిపాలెం ప్రజావేదిక సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. పేదవారందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తాం. డ్వాక్రా సంఘాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలి. అందరికీ సంక్షేమ ఫలాలు అందాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావాలి. పారిశ్రామిక అభివృద్ధిలో ఏపీ చాలా ముందుంది. దేశంలోనే మెగా ఫర్నిచర్ పార్క్ గూడూరులో వస్తోంది. 10 వేల మందికి ఉపాధి కల్పించబోతున్నాం. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. ఒకప్పుడు పెట్టుబడిదారులు పారిపోయారు. ఇప్పుడు రాష్ట్రాన్ని వెతుక్కుంటూ వస్తున్నారు. మిగతా..2లో

### ప్రకృతి వారసత్వాన్ని కాపాడుకోవటం

## బాధ్యతగా భావించాలి

- రూ. 36 కోట్ల వ్యయంతో 12 నగర వనాలు, 6ఎకో టూరిజం పార్కుల ఏర్పాటు
- వర్చువల్ గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్
- కాలుష్యంతో నిండిపోతున్న నగరాలకు ఇవి ఊపిరి పోస్తున్నాయన్న పవన్




అమరావతి : ప్రకృతి వారసత్వాన్ని కాపాడుకోవటం అందరి బాధ్యతగా భావించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మనిషి ప్రకృతిని పరిరక్షిస్తూ అభివృద్ధి సాధించినప్పుడే అది నిజమైన అభివృద్ధి అవుతుందని స్పష్టంచేశారు. అందుకే నక్షత్రవనాలు, రాశి వనాల ద్వారా సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. అదే సమయంలో ట్రెక్కింగ్ వంటి సాహస క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు పవన్ కల్యాణ్ అనంతపురం, శ్రీ సత్యసాయి, శ్రీపొట్టి శ్రీరాములు మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## ప్రకృతి వారసత్వాన్ని కాపాడుకోవటం
# బాధ్యతగా భావించాలి

నెల్లూరు జిల్లాల పరిధిలో 12 నగర వనాలు, 6 ఎకో టూరిజం పార్కులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి నెల్లూరు నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. రూ.36 కోట్ల వ్యయంతో నగరవనాలు, ఎకో పార్కులు ఏర్పాటు చేశామని పవన్ కల్యాణ్ తెలిపారు. కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న నగరాల్లో పచ్చదనం పెంచడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నగరాల్లో పచ్చదనం పెంచడానికి ఇవి దోహదపడతాయని పవన్ కల్యాణ్ తెలిపారు. కాలుష్యంతో నిండిపోతున్న నగరాలకు ఇవి ఊపిరి పోస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అర్బన్ గ్రీన్ ఇన్‌ఫ్రాకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. నగరవనాల్ని రాబోయే తరాల కోసం నిర్మిస్తున్న పచ్చని వారసత్వంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. "అర్బన్ గ్రీన్ ఇన్‌ఫ్రాకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ప్రకృతితో పాటు అభివృద్ధి సాధించినప్పుడే నిజమైన అభివృద్ధి. నక్షత్రవనాలు, రాశి వనాల ద్వారా సంప్రదాయాలకు పెద్దపీట. నగరవనాలు రాబోయే తరాల కోసం నిర్మిస్తున్న పచ్చని వారసత్వం. ప్రకృతి వారసత్వాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యతగా భావించాలి.

## బీచ్‌లను కూడా మద్యం కేంద్రాలుగా మారుస్తారా?

అంటూ వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్ర సామాజిక వాతావరణాన్ని పూర్తిగా చెడగొట్టేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తే, రేపు సామాన్య కుటుంబాలు బీచ్‌లకు ఎలా వెళ్తాయని కూటమి సర్కార్‌ను నిలదీశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, వేధింపులకు గురిచేయడం, చివరకు లాకప్ డెత్‌లకు పాల్పడటం వంటి దారుణాలు రాష్ట్రంలో జరుగుతున్నాయని జగన్ ఆరోపించారు. చంద్రబాబుకు అసలు మానవత్వం ఉందా? అని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెట్టుబడులను ఆకర్షించే చేతగాని ఈ ప్రభుత్వం... కేవలం అవినీతి, దోపిడీ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని దుయ్యబట్టారు. "రాష్ట్రానికి కొత్తగా విదేశీ పెట్టుబడులు రావడం లేదు కానీ, ఇక్కడ దోచుకున్న సొమ్ము మాత్రం విదేశాలకు వెళ్తోంది" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం...
# ఏపీలో వారం రోజుల పాటు భారీ వర్షాలు

మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది. సముద్రంలోకి వెళ్లిన వారు వెంటనే తీరానికి చేరుకోవాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## విద్యా శాఖ మంత్రిగా
# లోకేశ్ పనితీరుకు రాష్ట్రపతి ప్రశంసలు

వారికి బంగారు భవిష్యత్తును అందిస్తాయని అన్నారు. అంతకుముందు స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ చేసిన ప్రసంగం యువతలో స్ఫూర్తి నింపేలా సాగిందని రాష్ట్రపతి కొనియాడారు. పట్టభద్రులకు మంచి సందేశం ఇచ్చారని అభినందించారు. ఏపీ విద్యా విధానాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు లోకేశ్ కృషి చేస్తున్న విషయం తెలిసిందే.

## ఆదాయ సమీకరణపై సీరియస్‌గా ఫోకస్ పెట్టండి..
# అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా బడ్జెట్‌ను తయారు చేసుకోవాలన్నారు. భూసేకరణను మొదటి ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచనలు చేశారు. ఊహాజనిత బడ్జెట్ కాదని.. వాస్తవికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్

ఇటీవల రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గడువులో సగం కాలం పూర్తయినా, చెప్పుకోవడానికి ఒక్క విజయం కూడా లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వరి సాగు 2014-15 నాటికి ఉన్న 26 లక్షల హెక్టార్ల నుంచి, పాలన ముగిసే సమయానికి 59 లక్షల హెక్టార్లకు పెరిగిందని గుర్తు చేశారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వంపై నిందలు వేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ. 3.5 లక్షల కోట్లు మాత్రమేనని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత దారుణంగా ఉంటే ముఖ్యమంత్రి 72 సార్లు ఢిల్లీ పర్యటనలు ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ, ప్రెస్ క్లబ్ లేదా జూబ్లీహిల్స్ ప్యాలెస్.. వేదిక ఏదైనా చర్చకు తాను వస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చర్చకు రేవంత్ రెడ్డి లేదా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. "ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా నిరూపించడంలో నేను విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను" అని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు.

## కవిత పార్టీ పేరుపై
# అభ్యంతరాల వెల్లువ.. ఈసీకి 700 ఫిర్యాదులు

600 నుంచి 700 వరకు అభ్యంతరాలు అందాయి. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ అభ్యంతరాలను ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు వ్యక్తం చేశారు. గతంలో 'తెలంగాణ రాష్ట్ర సమితి'గా ఉన్న తమ పార్టీ పేరును ఇది పోలి ఉండటం వల్ల ప్రజల్లో గందరగోళం తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు అభ్యంతరాలపై కవిత పార్టీ ప్రతినిధులు ఈసీకి వివరణ ఇచ్చారని, మిగిలిన వాటికి కూడా సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం. తెలంగాణ ఉద్యమంలో 'టీఆర్ఎస్' కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 2026 ఏప్రిల్ నెలాఖరులో కవిత తన నూతన పార్టీని ప్రకటించిన సమయంలో, ఈ పేరుపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. అనంతరం, ఈసీఐ అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు ఇచ్చింది. జూన్ నెలలో బీఆర్ఎస్ పార్టీ అధికారికంగా అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు, సోలాపూర్‌కు చెందిన మరో సంస్థ కూడా ఇదే తరహా పేరు కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఈ ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం అందిన అన్ని అభ్యంతరాలను, వాటికి లభించిన వివరణలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రాజకీయ పార్టీల పేర్లు, గుర్తుల నిబంధనలకు అనుగుణంగా, ఓటర్లలో ఎలాంటి అయోమయం లేకుండా చూసేందుకు సమీక్ష నిర్వహించిన తర్వాతే ఈసీ తన తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

# రికార్డు స్థాయిలో జీఎస్టీ కలెక్షన్స్.. జూన్ నెలలో రూ.1.94 లక్షల కోట్ల ఆదాయం

మొదటి పేజి తరువాయి

అందిన నికర జీఎస్టీ ఆదాయం జూన్‌లో 11.2 శాతం వృద్ధితో రూ.1,62,377 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే నెలలో నికర వసూళ్లు రూ.1,45,984 కోట్లుగా ఉన్నాయి. ఈసారి మొత్తం రిఫండ్‌లు కూడా దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లకు చేరాయి.

### ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సూచిక

ఎగుమతులపై 'ఐస్‌గేట్' ద్వారా ఇచ్చిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లుగా ఉన్నాయి. ఇక నికర ఆదాయాన్ని విశ్లేషిస్తే.. దేశీయ లావాదేవీలపై వచ్చిన నికర జీఎస్టీ రాబడి కేవలం 2.6 శాతం మాత్రమే పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం ఏకంగా 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది. ఇది దిగుమతులపై ఆధారపడి పన్ను వసూళ్లు ఎంతగా పెరిగాయో స్పష్టంచేస్తోంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) గణాంకాలను పరిశీలిస్తే.. స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం వృద్ధితో రూ.6,31,699 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంలో ఈ వసూళ్లు రూ.5,82,542 కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ రాబడి 7.1 శాతం పెరిగి రూ.5,40,218 కోట్లుగా నమోదైంది. మే నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదవగా, జూన్‌లోనూ అదే స్థాయి వసూళ్లు కొనసాగడం ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సూచికగా నిపుణులు భావిస్తున్నారు.

## పెట్టుబడుల్లో దేశంలోనే ఏపీ నెంబర్ 1
# గూడూరులో మెగా ఫర్నిచర్ పార్క్

మొదటి పేజి తరువాయి

నమ్మకం కలిగించినందుకే రాష్ట్రానికి క్యూ కడుతున్నారు" అని చంద్రబాబు అన్నారు. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్: 'గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని, జీవితంలో ఆ పార్టీ మళ్లీ గెలవకూడదని, ఎన్డీయే ప్రభుత్వమే అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేరాలు చేయడం రాజకీయ పార్టీలకు తగదని, నేరస్థుల పార్టీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో పార్టీలను చూశానని, నేరాలు చేసే పార్టీని, నేరస్థులను కాపాడే పార్టీని చరిత్రలో మొదటిసారి ఇప్పుడే చూస్తున్నానని మండిపడ్డారు. అర్హత లేనివాళ్లకు అందలం ఎక్కిస్తే చాలా సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అవుతుందని మరోసారి హెచ్చరించారు. హోంమంత్రి అనితపై అసభ్య వ్యాఖ్యలను తప్పుబట్టారు. గొడ్డలి పార్టీ నేత సతీమణిపై పోస్టు పెడితే వెంటనే అరెస్టు చేశామని, ఆడవాళ్లపై నోరు పారేసుకున్న ఎవరినీ వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు. గతంలో మానసిక క్షోభ అనుభవించా: విజయవాడలో ఒక వ్యక్తి అదృశ్యమయ్యారని, ఆయనను అరెస్టు చేసిన తర్వాతే మిస్ అయ్యాడని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రాగానే సిట్ వేసి దర్యాప్తు ప్రారంభించామని, తప్పు చేసింది పోలీసులైనా సరే




చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించానని చెప్పారు. అయితే, ఈ వ్యవహారానికి కొందరు కుల ముద్ర వేసి విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టారని, అసలు ఇలాంటి అసభ్యకర పోస్టులతో ఏం సాధించాలని అనుకుంటున్నారని చంద్రబాబు ప్రశ్నించారు. గతంలో తన భార్యను అసెంబ్లీ సాక్షిగా దూషిస్తే, తాము ఎంతో మానసిక క్షోభ అనుభవించామని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు ఏకంగా డిప్యూటీ సీఎం కుమార్తెలపై కూడా నీచమైన పోస్టులు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి నేను, పవన్ ముందుకొచ్చాం: గొడ్డలి పార్టీ కులమతాల మధ్య చిచ్చుపెడుతూ అమరావతిపై దుష్ప్రచారం చేస్తోందని, గత ఐదేళ్లలో మూడు ముక్కలాట తప్ప ఏమీ చేయలేదని సీఎం చంద్రబాబు మండిపడ్డారు.

భవిష్యత్తులో అన్ని ఏసీ బస్సులే నడుపుతామన్నారు. లబ్ధిదారులు ఏదైనా ఒక నెలలో తీసుకోకపోయినా, మూడు నెలల పింఛన్ ఒకేసారి ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి తాను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి ముందుకొచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, సుపరిపాలనకు నాంది పలికామని హర్షం వ్యక్తం చేశారు. 'మన మిత్ర' యాప్‌లోనే అన్ని ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచామని, 62.20 లక్షల మంది కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. తాను ఇంట్లో కూర్చుని బటన్ నొక్కేవాణ్ని కాదని, ప్రజల్లో ఉండే వ్యక్తినన్నారు. 28 కేటగిరీల వారికి పండుగ వాతావరణంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని స్పష్టం చేశారు. "సంజీవని ప్రాజెక్టు" తీసుకువస్తున్నాం: రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి 'సంజీవని ప్రాజెక్టు' తీసుకువస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రజలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గంజాయికి ఆంధ్రప్రదేశ్‌లో అస్సలు చోటు లేదని, రాష్ట్రాన్ని పూర్తిగా డ్రగ్ రహితంగా తయారుచేస్తామని స్పష్టం చేశారు. విద్యా రంగంలో మార్పులు వస్తున్నాయని, ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ బడుల్లోకి విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

# భారత్, పాక్ మధ్య శాంతి చర్చలు పునఃప్రారంభించాలి

మొదటి పేజి తరువాయి

రెండు దేశాల మధ్య దౌత్య, వాణిజ్య, రవాణా సంబంధాల్ని మునుపటిలా సాధారణ స్థితికి తీసుకురావాలని అభ్యర్థించారు. జూన్ 30వ తేదీతో విడుదలైన ఈ బహిరంగ లేఖపై భారత్‌కు చెందిన 61 మంది, పాకిస్థాన్‌కు చెందిన దాదాపు 55 మంది ప్రముఖులు సంతకాలు చేశారు. సెంటర్ ఫర్ పీస్ ప్రోగ్రెస్ ఛైర్మన్ ఓపీ షా సమన్వయంతో ఈ లేఖను రూపొందించారు. ఇక ఈ లేఖపై జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, మాజీ రా భారత గూఢచార సంస్థ) చీఫ్ ఏఎస్ దులత్, రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝా, కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్, మితవాద వేర్పాటువాద నాయకుడు మిర్వైజ్ ఉమర్ ఫరూక్, పాకిస్థాన్ మాజీ విదేశాంగ శాఖ మంత్రి ఖుర్షీద్ మహ్మద్ కసూరీ, మాజీ దౌత్యవేత్త అష్రఫ్ జహంగీర్ ఖాజీతో పాటు పలువురు మాజీ రాయబారులు, పౌర సమాజ ప్రతినిధులు సంతకాలు చేశారు.

'చర్చలే సమస్యల పరిష్కారానికి ఏకైక మార్గం'- లేఖలో ప్రముఖులు

ఈ సందర్భంగా భారత్, పాక్ మధ్య విభేదాల్ని పరిష్కరించేందుకు నిరంతర ద్వైపాక్షిక చర్చలే ఏకైక మార్గమని లేఖలో వారు పేర్కొన్నారు. దక్షిణాసియాలో శాంతిని నెలకొల్పడం, పరస్పర సహకారాన్ని పునరుద్ధరించడం, సాధారణ పరిస్థితులకు తీసుకొచ్చేందుకు రెండు దేశాల ప్రభుత్వాలు అర్థవంతమైన, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో రెండు దేశాల మధ్య పూర్తి స్థాయిలో దౌత్య సంబంధాల్ని పునరుద్ధరించాలని, హైకమిషనర్లను తిరిగి నియమించాలని, సాధారణ వీసా సేవల్ని కూడా పునఃప్రారంభించాలని లేఖలో సూచించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న అన్ని ద్వైపాక్షిక అంశాలపై సమగ్ర చర్చలు ప్రారంభించాలని కోరారు.

'సైనిక ఉద్రిక్తతలు తగ్గించేలా చర్యలు చేపట్టాలి'

జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన అన్ని అంశాలపైనా చర్చలు కొనసాగించాలని ఆ ప్రముఖులు లేఖలో పేర్కొన్నారు. 2004 నుంచి 2007 వరకు ఇరు దేశాలు చర్చించిన అంశాల్ని మరోసారి పరిశీలించాలని సూచించారు. ఇరు దేశాల భద్రతా ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని సైనిక ఉద్రిక్తతల్ని తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. లేఖలో పేర్కొన్న ఇతర అంశాలు చూస్తే- 'భారత్ పాకిస్థాన్ మధ్య వాణిజ్య సంబంధాలు తిరిగి ప్రారంభించాలి. అట్టారీ వాఘా సరిహద్దు వాణిజ్య మార్గాన్ని తిరిగి తెరవాలి. దిల్లీ- లాహోర్ బస్సు సర్వీస్, శ్రీనగర్- ముజఫరాబాద్ బస్సు సర్వీస్, సంఝౌతా ఎక్స్‌ప్రెస్, థార్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవల్ని పునరుద్ధరించాలి. కార్గిల్ స్కార్దూ మార్గాన్ని తెరవాలి. కమర్షియల్ ఫ్లైట్స్ తిరిగేందుకు వీలుగా ఇరు దేశాలు గగనతలాల్ని మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలి' అని విజ్ఞప్తి చేశారు.

200 కోట్ల మంది సంక్షేమం, ఆశయాల కోసమే




ఇదే సమయంలో కర్తార్‌పుర్ సాహిబ్ కారిడార్‌ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని, శారదా పీఠాన్ని యాత్రికుల కోసం తెరవాలని లేఖలో సూచించారు. 'దక్షిణాసియా భవిష్యత్తు- విభేదాలు, ఘర్షణలతో కాకుండా శాంతి, అభివృద్ధి, పరస్పర సహకారంతో ముందుకు సాగాలి' అని పేర్కొన్నారు. చివరగా ఇది ఏ రాజకీయ వైఖరికి మద్దతుగా రాసిన లేఖ కాదని, దాదాపు 200 కోట్ల మంది ప్రజల సంక్షేమం, ఆశయాల్ని దృష్టిలో పెట్టుకొని చేసిన విజ్ఞప్తి మాత్రమేనని స్పష్టం చేశారు. భారత్-పాకిస్థాన్ జనాభాలో అధిక శాతం యువతేనని, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల లక్షలాది మంది యువత ఉపాధి, విద్య, వ్యాపారం, అభివృద్ధి అవకాశాల్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. అందుకే ఘర్షణకు బదులుగా సహకారం, శత్రుత్వానికి బదులు సంభాషణ, ఒంటరితనానికి బదులుగా పరస్పర భాగస్వామ్యాన్ని ఎంచుకోవాలని ఇరు ప్రభుత్వాల్ని కోరారు.

# దొంగలకు శిక్ష పడాలంటే ప్రభుత్వం మారాలి'- అయోధ్య విరాళాల చోరీపై కేజ్రీవాల్ ఫైర్

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రామమందిర విరాళాలను దొంగిలించిన వారికి శిక్ష పడాలంటే ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ప్రభుత్వంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ప్రతి రామభక్తుడిపై ఉందని తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "బీజేపీ నాయకులు, రాముడిని దేవుడిగా పరిగణించరు. అసలు నిజంగా వాళ్లకు రాముడిపై అభిమానం ఉంటే ఈ దొంగతనం చేసేవారు కాదు. ఆ రాముడి దయ వల్లే వారు కేంద్రంలో, 21 రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చారు. కానీ, కనీసం ఆ కృతజ్ఞత కూడా వారికి లేదు. ఇక, అయోధ్య నిధుల దుర్వినియోగంపై ప్రతి హిందువు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. బీజేపీ కేవలం అధికారం, డబ్బు కోసమే సనాతన ధర్మాన్ని వాడుకుంటోంది. కానీ మేం అలాకాదు. దేశంలో నిజమైన సనాతన పార్టీ ఏదైనా ఉందంటే అది ఆప్ మాత్రమే. మేం ప్రజల కోసం ఉచిత తీర్థయాత్రలు, ఆలయాల నిర్మాణాలు, భజన సంధ్యలు నిర్వహిస్తూ అవినీతి రహిత పాలన అందిస్తున్నాం."

**అరవింద్ కేజ్రీవాల్ , ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్**

**'నేను చాట్ జీపీటిని కూడా అడిగాను'**




మరోవైపు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కూడా కేజ్రీవాల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రామమందిర ప్రాణ ప్రతిష్ఠ జరిగి రెండున్నరేళ్లు గడిచినా అమిత్ షా ఒక్కసారి కూడా అయోధ్య రామాలయాన్ని సందర్శించలేదని ఆరోపించారు. "నేను ఇంటర్నెట్ లో చూశాను. చాట్ జీపీటీని కూడా అడిగాను. జర్నలిస్ట్ లతో మాట్లాడాను. అందులో తెలిసిన విషయం ఏమిటంటే, అమిత్ షా తన ప్రసంగాల్లో, ఇంటర్వ్యూల్లో 42 సార్లకు పైగా రామమందిరం గురించి ప్రస్తావించారు. దాని పేరుతో ఓట్లు అడిగారు. ఆయనకు రాముడి పేరుతో ఓట్లు అడిగడానికి సమయం ఉంటుంది, కానీ ఆలయానికి వెళ్లేందుకు మాత్రం సమయం దొరకలేదా? రాముడి ఆశీర్వాదం అవసరం లేదా? రాముడిని దేవుడిగా భావించడం లేదా?" అంటూ కేజ్రీవాల్ ప్రశ్నించారు. అలాగే, అమిత్ షా తప్పకుండా అయోధ్య రామమందిరాన్ని సందర్శించాలని కేజ్రీవాల్ కోరారు. ఇదిలా ఉండగా, అయోధ్యలోని రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో అరెస్టైన నిందితులందరినీ స్థానిక కోర్టు సోమవారం 14 రోజులు జ్యుడిషియల్ కస్టడీ విధించింది. ఆలయానికి వచ్చిన నగదు విరాళాలు, కానుకల దుర్వినియోగంపై పోలీసులు జరిపిన దర్యాప్తు అనంతరం కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.

## 'రాముడి సొమ్మును దొంగిలించిన వారికి క్యాన్సర్ వస్తుంది'

మరోవైపు, ఆలయ నిధుల దుర్వినియోగంపై ఉత్తర్ ప్రదేశ్‌లోని బీజేపీ ఎమ్మెల్యే అనిల్ సింగ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. రాముడి సొమ్మును దొంగిలించిన వారు, ఆ దేవుడి శిక్ష నుంచి తప్పించుకోరని, వారు క్యాన్సర్ బారిన పడి అత్యంత బాధాకరమైన మరణాన్ని పొందుతారని ఆయన శాపనార్థాలు పెట్టారు. ఈ అవినీతికి పాల్పడిన వారిపై ప్రభుత్వం ఎలాగో చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. కానీ, శ్రీరాముడు వారిని ఎంత ఘోరంగా శిక్షిస్తాడంటే, వారు నరకయాతన అనుభవిస్తూ చనిపోతారని వ్యాఖ్యానించారు. ఆ పరిణామాలను వారి తదుపరి ఏడు తరాల వరకు గుర్తుపెట్టుకుంటారని ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు చేశారు.

# టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర- ఎమ్మెల్యేకు రూ.35 కోట్లు !

### విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు డీఎంకే కుట్ర పన్నిందంటూ ఆరోపణలు

### తమ ఎమ్మెల్యేకు రూ.35 కోట్లు ఆశచూపారన్న టీవీకే మంత్రి నిర్మల్ కుమార్

విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు డీఎంకే కుట్రపన్నిందని రాష్ట్ర మంత్రి నిర్మల్ కుమార్ బుధవారం సంచలన ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేను ప్రలోభపెట్టేందుకు డీఎంకే అధినేత స్టాలిన్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. కొన్ని రోజుల క్రితం టీవీకే పార్టీకి చెందిన కొందరు తమ ఎమ్మెల్యేకు రూ.35 కోట్లు ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపించారు. టీవీకే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడితే దానికి మద్దతుగా ఓటు వేయాలని ఒత్తిడి తెచ్చారని చెప్పారు. అయితే ఆ ఆఫర్ ను తమ ఎమ్మెల్యే తిరస్కరించారని నిర్మల్ కుమార్ చెప్పారు. అన్ని ఆధారాలతో ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారని తెలిపారు.

### నన్ను బెదిరించారు!

డీఎంకేకు చెందిన వారు తనను బెదిరించారని టీవీకే ఎమ్మెల్యే ఎన్ .ఇళయరాజా ఆరోపించారు. తమిళనాడు శాసనసభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలంటూ రూ.35 కోట్లు లంచం ఇవ్వజూ-పారని అన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు బుధవారం అధికారులు తెలిపారు.



### అసలేం జరిగింది?

జూన్ 29న గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ కు టీవీకే ఎమ్మెల్యే ఎన్ . ఇళయరాజా ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదు పత్రంలో సంచలన ఆరోపణలు చేశారు. "తిరునావుక్కరసు అనే వ్యక్తి నా దగ్గరకు వచ్చి, తాను 'ఇండియన్ పొలిటికల్ డెమోక్రటిక్ స్ట్రాటజీస్ ' (ఐపీడీఎస్ ) అనే ఎగ్జిట్ పోల్ / అభిప్రాయ సేకరణ సంస్థను నడుపుతున్నానని పరిచయం చేసుకున్నాడు. ఒక ప్రధాన రాజకీయ పార్టీ (డీఎంకే)కి చెందిన నేతల అభ్యర్థన మేరకే తాను వచ్చినట్లు చెప్పాడు. తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ కు వ్యతిరేకంగా ఒక తీర్మానం ప్రవేశపెడతారని చెప్పాడు. నేను దానికి మద్దతుగా ఓటు వేయాలని కోరాడు. దానికి ప్రతిఫలంగా రూ.35 కోట్లు ఇస్తామని ఆశ చూపాడు. కానీ నేను ఆ ప్రతిపాదనను పూర్తిగా తిరస్కరించాను. దీనితో అతడు ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని నన్ను బెదిరించాడు" అని ఎన్ .ఇళయరాజా తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

### ముగ్గురు నిందితులు అరెస్టు

ఎమ్మెల్యే ఫిర్యాదుతో చెన్నైలోని డి1 ట్రిప్లికేన్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. దీనితో చెన్నై అరుంబాక్కంకు చెందిన తిరునావుక్కరసుతోపాటు తిరుచిరాపల్లికి చెందిన నరేశ్ , చెన్నై మేడవక్కంకు చెందిన త్యాగరాజన్ లను పోలీసులు అరెస్టు చేశారు.

### వెలుగులోకి సంచలన విషయాలు!

'విచారణ చేయగా నిందితులు కొన్ని సంచలన విషయాలు వెల్లడించారు. మాజీ డీఎంకే మంత్రి, ప్రస్తుత కోయంబత్తూరు సౌత్ ఎమ్మెల్యే వి.సెంథిల్ బాలాజీ సోదరుడైన వి. అశోక్ కుమార్ చెన్నైలో నిందితుడు నరేశ్ ను కలిసినట్లు తెలిసింది. అలాగే తిరునావుక్కరసు అనే నిందితుడి వి.సెంథిల్ బాలాజీ, వి. అశోక్ కుమార్ ఆదేశాల మేరకే ఈ పొలిటక్ హార్స్ ట్రేడింగ్ చేసినట్లు ఆధారాలు లభించాయి' అని టీవీకే ఎమ్మెల్యే తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా, ఈ కేసుపై సమగ్ర విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### తమిళనాట పెను రాజకీయ మార్పు

ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ సంచలన విజయం సాధించింది. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న డీఎంకే, అన్నా డీఎంకే పార్టీల ఆధిపత్యానికి గండిపడింది. ప్రముఖ నటుడైన విజయ్ పార్టీ పెట్టి మొదటిసారి చేసిన పోటీలోనే ఏకంగా 108 స్థానాలు గెలుచుకున్నారు. అయితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ ఆయన సాధించలేకపోయారు. దీనితో కాంగ్రెస్ సహా మరికొన్ని వామపక్ష పార్టీలు ఆయనకు మద్దతు ఇచ్చాయి. ఫలితంగా విజయ్ తమిళనాడు 13వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

# ప్రధాని మోడీజీ స్ఫూర్తి




## స్వర్ణాంధ్ర -2047 దిశగా చంద్రబాబు అడుగులు

ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ గమ్యస్థానంగా ఏపీ!

లక్షలాది మంది భారతీయ యువతకు స్ఫూర్తి రాష్ట్రపతి ముర్ము జీవితం

సౌకర్యవంతమైన మార్గాన్ని ఎంచుకునే వారికి విజయం దక్కదు

ఉద్యోగార్థులుగా కాదు

ఉద్యోగాల సృష్టికర్తలుగా యువత ఎదగాలి

అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ తొలి కాన్వకేషన్ లో మంత్రి లోకేష్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ దూరదృష్టి గల నాయకత్వంలో భారతదేశ జాతీయ విద్యా విధానం , డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, వికసిత్ భారత్ 2047 దార్శనికత ద్వారా విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నారు. ఈ స్ఫూర్తితో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర 2047 దిశగా అడుగులు వేస్తున్నారు. తద్వారా విద్య, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలను సృష్టించగల, భవిష్యత్తుకు సంసిద్ధమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఈరోజు యువ పట్టభద్రులతో నిండిన ఈ సభను చూస్తున్నప్పుడు నాకు కేవలం పట్టాలు స్వీకరిస్తున్న విద్యార్థులు మాత్రమే కనిపించడం లేదు. భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సిద్ధంగా ఉన్న ఒక తరం కనిపిస్తోంది. ప్రతి తరానికీ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. భవిష్యత్తును నిర్మించే అవకాశం ఈ తరానికి లభించింది. ఇది మీ సమయం, ఇది మీకు లభించిన గొప్ప అవకాశం. మీ నేపథ్యం మీ భవిష్యత్తును నిర్ణయించేలా ఎప్పుడూ అనుమతించకండి. మీ కలలు, మీ కఠోర శ్రమ, మీ వ్యక్తిత్వం ఇవే మీరు ఎవరన్నదానిని నిర్వచించేలా చూసుకోండి. రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము తో కలిసి ఇక్కడ కూర్చునే భాగ్యం మనకు దక్కింది. ఆమె జీవితం కేవలం తరగతి గదిలో నేర్వలేని ఒక పాఠం. ఆమె ఒక చిన్న గిరిజన గ్రామంలో జన్మించారు. చాలా మందిలాగే కుంగదీసే వ్యక్తిగత విషాదాలను ఆమె ఎదుర్కొన్నారు. అయినా ఆమె ఎన్నడూ విశ్వాసం కోల్పోలేదు సేవ చేయడం ఆపలేదు ముందుకు సాగడం ఆపలేదు. ఒక ఉపాధ్యాయురాలిగా ఒక శాసనసభ్యురాలిగా ఒక గవర్నర్‌గా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాష్ట్రపతిగా మన ముందున్నారు. ఆమె ప్రయాణం ప్రతి యువ విద్యార్థికి ఒక సత్యాన్ని చెబుతుంది మీ ప్రారంభం మీ గమ్యాన్ని నిర్ణయించదు. మీ ధైర్యమే నిర్ణయిస్తుంది. భారత రాష్ట్రపతి ఒక చిన్న గిరిజన గ్రామం నుండి రాష్ట్రపతి భవన్‌కు ఎదగగలిగితే మీ విద్య మీకు ఏమి సాధించడంలో సహాయపడుతుందో ఊహించండి. మేడమ్ జీవితం లక్షలాది మంది భారతీయ యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది.

### తొలి బ్యాచ్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవానికి హాజరవ్వడం నాకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ప్రతి స్నాతకోత్సవం ప్రత్యేకమైనదే కానీ మొదటి స్నాతకోత్సవం ఎప్పటికీ చారిత్రాత్మకమైనది. ప్రతి సంవత్సరం డిగ్రీలు ప్రదానం చేస్తారు కానీ చరిత్ర ఒక్కసారే లిఖించబడుతుంది. రాబోయే సంవత్సరాలలో ఈ విశ్వవిద్యాలయం నుండి వేలాది మంది విద్యార్థులు పట్టభద్రులవుతారు. కానీ కేవలం ఒకే ఒక్క బ్యాచ్ మాత్రమే ఎప్పటికీ గుర్తుండిపోతుంది అదే మొదటి బ్యాచ్. ఆ గౌరవం ఆ వారసత్వం మీకే చెందుతుంది. ప్రతి పట్టభద్రుడికి, ప్రతి స్వర్ణ పతక విజేతకు నా హృదయపూర్వక అభినందనలు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ కేవలం ఒక విద్యా ప్రాంగణం మాత్రమే కాదు, అదొక హామీ. నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి యువ మేధస్సుకు కలలు కనే, నేర్చుకునే, విజయం సాధించే అవకాశం దక్కాలన్న హామీ అది. నేడు ఇక్కడ కూర్చున్న ప్రతి పట్టభద్రుడి రూపంలో ఆ హామీ కళ్ల ముందు సాక్షాత్కరిస్తోంది. మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ గమ్యస్థానంగా ఎపి,ప్రపంచం మునుపెన్నడూ లేనంత వేగంగా మారుతోంది. కొత్త టెక్నాలజీ రూపాంతరం చెందుతూనే ఉంటుంది. కానీ పోటీతత్వ ప్రయోజనం కేవలం సాంకేతికత మాత్రమే కాదు. అది ఎల్లప్పుడూ జిజ్ఞాస, సృజనాత్మకత, ధైర్యం, నిరంతరం నేర్చుకోవాలనే తపనతో కూడుకుని ఉంటుంది. నిరంతరం నేర్చుకుంటూ, పరిస్థితులకు అనుగుణంగా మారుతూ, మార్పునకు నాయకత్వం వహించే ధైర్యవంతులదే భవిష్యత్తు. ఎందుకంటే భవిష్యత్తు టెక్నాలజీని ప్రతిఘటించేవారిది కాదు, దానిని నేర్చుకుని, పరిస్థితులకు అనుగుణంగా మారి, నూతన ఆవిష్కరణలు చేసేవారిదే. అందుకే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం సిద్ధమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చైతన్యవంతమైన నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలకు గమ్యస్థానంగా మారుతోంది. యువ భారతీయులకు ఇది ఎంతో ఉత్సాహభరితమైన సమయం ఇది. సాంకేతికత, తయారీ, పరిశోధన, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమ వంటి రంగాల్లో కొత్త అవకాశాలు ఆవిర్భవిస్తున్నాయి.

### అవకాశాలు సృష్టించే వారు కావాలి

నేటి ప్రపంచానికి అవకాశాల కోసం ఎదురుచూసే వారు అవసరం లేదు. అవకాశాలను సృష్టించే వారు కావాలి. కేవలం ఉద్యోగార్థులుగా ఉండాలని ఆశించవద్దు. ఉద్యోగ సృష్టికర్తలుగా మారండి. సంస్థలను నిర్మించండి. ఆవిష్కరణలను నిర్మించండి. పరిష్కారాలను రూపొందించండి. ఇతరుల్లో ఆశను నింపండి. ఎప్పుడూ సౌకర్యవంతమైన మార్గాన్ని ఎంచుకునే వారికి విజయం దక్కదు. కఠినమైన మార్గాన్ని ఎంచుకునే ధైర్యం ఉన్నవారికే విజయం లభిస్తుంది. తక్కువ మంది ప్రయాణించే మార్గమే తరచుగా అద్భుతమైన విజయానికి దారితీస్తుంది. కొత్త విషయాలను అన్వేషించే ఆసక్తి పెంపొందించుకోండి. విఫలమైనా తట్టుకునే ధైర్యం, మళ్లీ పుంజుకునేంత దృఢ సంకల్పం కలిగి ఉండండి. గుర్తుంచుకోండి. పట్టభద్రుల వేడుకతో విద్య ముగిసిపోదు. అది జీవితకాల అభ్యాసానికి నాంది పలుకుతుంది.

### యూనివర్సిటీ గర్వపడే స్థాయికి ఎదగండి

ఈ రోజు మీరు ఈ ప్రాంగణం నుండి వెళుతున్నప్పుడు మీ విజ్ఞానాన్ని,ఆత్మవిశ్వాసంతో, మీ విలువలను వినయంతో, మీ కలలను ధైర్యంతో ముందుకు తీసుకువెళ్ళండి. జీవితంలో ఎక్కువ మంది ప్రయాణించని మార్గాన్ని ఎంచుకోవడానికి ఎప్పుడూ భయపడకండి. ఎందుకంటే గొప్ప విజయాలు సమూహాలను అనుసరించడం వల్ల రావు. దానికి నాయకత్వం వహించే ధైర్యంతోనే వస్తాయి. మీ కుటుంబం గర్వపడేలా చేసే వృత్తిని ఎంచుకోండి. మీ విశ్వవిద్యాలయానికి గర్వకారణమయ్యే వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోండి. భారతదేశం గర్వపడేలా ఒక గొప్ప వారసత్వాన్ని సృష్టించండి. ఎందుకంటే, పట్టభద్రులయ్యే మొదటి బ్యాచ్ కేవలం డిగ్రీలను మాత్రమే పొందదు. అది మీ తర్వాత వచ్చే ప్రతి తరానికీ స్ఫూర్తినిస్తుంది. మీ అందరికీ అభినందనలు. కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టండి కేవలం జీవనోపాధి కోసం మాత్రమే కాదు అవకాశాలను సృష్టించడానికి సమస్యలను పరిష్కరించడానికి ఈ ప్రపంచాన్ని మీరు చూసిన దానికంటే మెరుగైనదిగా తీర్చిదిద్దడానికి కార్యోన్ముఖులు కావాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ శంకర్ ఆచార్య, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి తదితరులు హాజరయ్యారు.

# పది జన్మలెత్తినా అమరావతిని అడ్డుకోలేవ్

మాజీ సీఎం జగన్ రెడ్డి పై మంత్రి సవిత ఫైర్

సీఎం చంద్రబాబు నేతృత్వంలో సీమాంధ్రుల

కలల రాజధానిని నిర్మించి తీరుతాం

ఒక్కో ఎన్నికలో జగన్ ది ఒక్కో స్టాండ్

2019లో అమరావతి, 2024లో 3 రాజధానులు, ఇప్పుడు మావిగన్

లండన్ మందులు పనిచేయక జగన్ బుర్ర పాడైనట్లుంది

కట్టుబొట్టు పేరుతో హోంమంత్రిని అవమానించిన అమర్నాథ్

ఆయన తల్లి పెంపకం ఇదేనా..?

వచ్చే ఎన్నికల్లో జగన్ పార్టీకి సమాధి ఖాయం

ప్రస్తుతం ఉన్న 11 సీట్లు గల్లంతే...మంత్రి సవిత




పెనుకొండ : జగన్ పది జన్మలెత్తినా అమరావతి నిర్మాణాన్ని అడ్డుకోలేదని, సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో సీమాంధ్రుల కలల రాజధానిని నిర్మించి తీరుతామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. లండన్ మందులు పని చేయకపోవడంతో జగన్ బుర్ర పనిచేయడం లేదని, ప్రతి ఎన్నికల ముందు రాజధానిపై ఆయన తన స్టాండ్ మారుస్తున్నారని మండిపడ్డారు. తల్లికి, చెల్లికి గౌరవమివ్వమని జగన్... రాష్ట్రంలోని మిగిలిన మహిళల పట్ల చులనకభావంతో చూస్తూ, అవమానిస్తున్నారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. హోంమంత్రి అనిత కట్టుబొట్టు కోసం మాట్లాడిన వైసీపీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ తల్లి పెంపకం ఇదేనా..? అని ఘాటుగా విమర్శించారు. సీఎం చంద్రబాబునాయుడు హయాంలోనే రైతులకు మేలు జరిగిందని, అయిదేళ్ల వైసీపీ పాలనలో వ్యవసాయరంగానికి ఒరిగిందేమీ లేదన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. జగన్ రెడ్డి మానసిక పరిస్థితి బాగోలేదని, ఆయనకు లండన్ మందులు పనిచేయడం లేదని అన్నారు. ప్రతి ఎన్నికల ముందు రాజధాని అంశంపై స్టాండ్ మారుస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో అమరావతికి జైకొట్టి, ప్రజలను వంచించి జగన్ అధికారంలోకి వచ్చారన్నారు. సీఎం కుర్చీ ఎక్కగానే మాట మార్చి, మూడు రాజధానులు అంటూ కొత్త డ్రామాకు తెరతీశారన్నారు. అయిదేళ్ల పాటు మూడు రాజధానులపై మాట్లాడడమే తప్ప, ఏ ప్రాంతంలోనూ బస్తా సిమ్మెంట్ కూడా వేయలేదన్నారు. 2024 ఎన్నికల్లో మూడు రాజధానులు అంటూ హడావుడి చేసిన జగన్ కు రాష్ట్ర ప్రజలు సరైన గుణపాఠం చెప్పారన్నారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. బుద్ధి మారని జగన్... ఇపుడు మావిగన్ అంటూ మరో డ్రామాకు తెరతీశారన్నారు. రాజధాని అంశంపై రోజుకో పిల్లిమొగ్గ వేస్తున్న జగన్ ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఆయన పది జన్మలెత్తినా అమరావతి రాజధానిని అడ్డుకోలేరన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని సీమాంధ్రుల కలల రాజధానిని ప్రపంచం మెచ్చేలా నిర్మిస్తామని స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రజలపైనా, అభివృద్ధిపైనా ఎందుకింత కక్ష అని జగన్ ను మంత్రి సవిత ప్రశ్నించారు.

### వచ్చే ఎన్నికల్లో జగన్ పార్టీకి సమాధి ఖాయం

రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. జగన్ నోటా శాంతిభద్రతలు మాట రావడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో ప్రతిపక్షాలపైనా, ప్రజలపైనా అక్రమ కేసులు బనాయించి నిర్బంధించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాతే ప్రజలు ఊపిరిపీల్చుకున్నారన్నారు. తాము కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే, ఒక్క వైసీపీ నాయకుడు కూడా బయటతిరగలేరన్నారు. తమ నాయకుడు, సీఎం చంద్రబాబు ప్రజాస్వామ్యవాది అని, అందుకు తామంతా రాజ్యాంగానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. రైతుల గురించి జగన్ మాట్లాడడం సిగ్గు చేటన్నారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్.. ఏరోజు కూడా రైతులను, వ్యవసాయ రంగాన్ని పట్టించకున్న పాపాన పోలేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న సమయాల్లోనే రైతులకు మేలు జరిగేదాని రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపైనా, సంక్షేమ కార్యక్రమాల అమలుపైనా చర్చకు రమ్మంటే జగన్ రెడ్డి ముఖం చాటేస్తున్నారని, కూటమి ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారని, ఇలాగే వ్యవహరిస్తే...రాబోయే ఎన్నికల్లో ఒక్క సీటులో ప్రజలు గెలవనివ్వరని మంత్రి సవిత హెచ్చరించారు.

### అమర్నాథ్... ఇదేనా నీ తల్లి పెంపకం..?

జగన్ రెడ్డికి మహిళలంటే చిన్నచూపు అని, అందుకే వారిని అవమానిస్తుంటారని మంత్రి సవిత మండిపడ్డారు. ఇంట్లో తల్లిని, చెల్లిని గౌరవిమవ్వని జగన్... రాష్ట్రంలో ఉన్న మిగిలిన మహిళల పట్ల అలాగే ప్రవర్తిస్తున్నాడని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని అవమానించినప్పుడు జగన్ పైశాచిక ఆనందాన్ని పొందారన్నారు. అమరావతి ప్రాంత మహిళలను, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని తీవ్రంగా అవమానించారన్నారు. హోంమంత్రి అనితపై వైసీపీ నాయకుడు అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తంచేశారు. హోంమంత్రి కట్టుబొట్టునుద్దేశించి అమర్నాథ్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఇదేనా ఆయన తల్లి పెంపకమని ప్రశ్నించారు. మహిళలను అవమానపరిచిన ఎంతవారైనా భూస్థాపితం కావాల్సిందేనని, ఇదే చరిత్ర చెబుతోందని మంత్రి సవిత హెచ్చరించారు.

## ప్రజా సంక్షేమం వైపే చంద్రబాబు ప్రభుత్వం

ప్రతి నెల 1న వేకువజామునే ఇంటింటికీ పెన్షన్లు

కొత్తచెరువులో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు,

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ



పుట్టపర్తి( : శ్రీ సత్యసాయి జిల్లా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని కొత్తచెరువు మండలం మైలేపల్లి గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటలకు నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని లబ్ధిదారులకు ఇంటి వద్దకే సామాజిక భద్రతా పెన్షన్లు అందజేశారు. ప్రతి నెల 1వ తేదీన వేకువజామునే అర్హులైన పేదలకు ఇంటి వద్దకే పెన్షన్లు అందించడం కూటమి ప్రభుత్వ ప్రజాహిత పాలనకు నిదర్శనమని వారు తెలిపారు.రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సుపరిపాలన కొనసాగుతోందన్నారు. గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ కోసం రూ.68 వేల కోట్లకు పైగా ప్రభుత్వం వ్యయం చేసినట్లు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సుమారు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందని కొనియాడారు. పుట్టపర్తి నియోజకవర్గంలో కూడా రూ.1.51 లక్షల కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే పెట్టుబడుల రాజధానిగా అవతరిస్తుందని, పేదల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, కన్వీనర్ రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, మైలేపల్లి గ్రామస్తులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని సరస్వతి విద్యా మందిర్ రెండు బ్రాంచ్‌లు సీజ్

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు.

ఏఐఎస్ఎ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్

పి.ఎస్.యు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, రాష్ట్ర నాయకులు చంద్ర




సోమందేపల్లి : సోమందేపల్లి మండల కేంద్రంలోని సరస్వతి విద్యా మందిర్ పాఠశాల యాజమాన్యం ఒకే అనుమతితో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సప్తగిరి కాలనీ, గీతానగర్ ప్రాంతాల్లో అదనపు బ్రాంచ్‌లు నిర్వహిస్తున్న విషయాన్ని విద్యార్థి సంఘాల నాయకులు మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు నాయక్,దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంఈఓ, గుర్తింపు లేని రెండు బ్రాంచ్‌లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ, విద్యాశాఖ అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని అన్నారు. ఇలాంటి అక్రమ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి, ప్రభుత్వ గుర్తింపు మరియు అవసరమైన అనుమతులు కలిగిన పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు పునీత్ కుమార్, చంద్ర శేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అభివృద్ధి వికేంద్రీకరణే కూటమి లక్ష్యం

జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్,

ఎంపీ బి.కే పార్థసారథి,మంత్రి సవిత,






పెనుకొండ:భివృద్ధి వికేంద్రీకరణ కూటమి ప్రభుత్వ లక్ష్యం... రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమలు స్థాపిస్తూ ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు అక్కడి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం...2029లోనే కాదు 2049లో కూడా గొడ్డలి పార్టీ అధికారంలోకి రాలేదు...రాజధాని అమరావతి పనులను అడ్డుకుంటున్న నేపథ్యంలో ఆ ప్రాంత రైతులు తాడేపల్లి ప్యాలెస్ ముట్టడించడం ఖాయం... అమృత్ పథకం అమలు చేయడం కూడా జగన్ ప్రభుత్వానికి చేతకాలేదు... కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.14,500 కోట్లతో ఇంటింటికీ తాగునీటి అందిస్తున్నాం... పెనుకొండ పట్టణంలో రూ.100 కోట్లతో కృష్ణా జలాలను తీసుకొచ్చి తాగునీరు అందిస్తాం' అని జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని ఒకటో వార్డు ఇస్లాంపురంలో జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తో కలిసి మంత్రి సవిత ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని రైల్వే బ్రిడ్జి నుంచి ఇస్లాం పురం వరకూ రూ.55 లక్షలతో చేపట్టిన రోడ్డునిర్మాణానికి భూమి పూజ చేశారు. తిమ్మపురంలో పట్టణంలో



ఇంటింటికీ తాగునీటి పంపిణీలో భాగంగా రూ.100.60 కోట్లతో అమృత్ 2.0 పథకానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 2,711 కోట్లతో 63 లక్షల మందికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబునాయుడు జోడు గుర్రాల్లా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రాయలసీమను హార్టీకల్చర్, పారిశ్రామిక హబ్ గా అభివృద్ధి చేస్తున్నారన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ ను నిర్మించి పెనుకొండ సహా చుట్టు పక్కల ప్రాంతాలను సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. గతంలో రోడ్డుపై తిరిగే కార్ల పరిశ్రమను తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు ఇప్పుడు దేశ రక్షణకు ఎంతో కీలకమైన యుద్ధ విమానాల పరిశ్రమను పుట్టపర్తిలో ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కొత్తగా 10 ఎంజేపీ గురుకులాలను ప్రారంభిస్తున్నామని, త్వరలో మరో పది గురుకులాలను ఏర్పాటు చేయనున్నామని, ఈ గురుకులాల మంజూరులో జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ కీలక పాత్ర పోషించారని మంత్రి సవిత కొనియాడారు. పెనుకొండలో నెలకొల్పిన ప్రభుత్వ ఐటీఐకి స్థలం మంజూరు చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రికి మంత్రి సవిత విన్నవించారు.

### జగన్ రాజా...అభివృద్ధి కనిపిస్తోందా..?

గతంలో అమృత్ పథకాన్ని వినియోగించుకోవడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారని మంత్రి సవిత మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, అమృత్ 2.0 పథకం ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని నిర్ణయించిందన్నారు. ఇందుకోసం రూ.14,500 కోట్లు వెచ్చిస్తోందని, అందులో రూ.100.60 కోట్లతో పెనుకొండలో ఇంటింటికీ కృష్ణా జలాలను తాగునీరుగా అందించనున్నామన్నారు. రాష్ట్రంలో, పెనుకొండలో జరుగుతున్న అభివృద్ధిపై కొందరు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడి నుంచో వచ్చిన వారు ఇక్కడ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాజా... రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కనిపిస్తోందా..? అంటూ జగన్ రెడ్డిని ఉద్దేశించి మంత్రి సవిత వ్యాఖ్యానించారు.

### నీ ప్యాలెస్ ను ముట్టడించడం ఖాయం...

కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడానికి జగన్, వైసీపీ కుట్ర పన్నుతోందని మంత్రి సవిత మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజధాని అమరావతి పనులను పరుగులు పెట్టిస్తోందన్నారు. అభివృద్ధిని చూసిని ఓర్వలేకపోతున్న జగన్ కుట్ర పన్నుతున్నారన్నారు. రైతుల ముసుగులో అమరావతి పనులను అడ్డుకోడానికి చూస్తున్నారన్నారు. జగన్ కుట్రలను రైతులు గమనిస్తున్నారని, ఇలాగే వ్యవహరిస్తే...వారంతా తాడేపల్లి ప్యాలెస్ ను ముట్టడించడం ఖాయమని మంత్రి సవిత హెచ్చరించారు.

### అభివృద్ధి వికేంద్రీకరణే కూటమి లక్ష్యం : జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని

రాష్ట్రమంతటా అభివృద్ధిని సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణే కూటమి లక్ష్యమని, అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమలు నెలకొల్పి, ఆయా ప్రాంతాల్లోని యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జగన్ మెప్పుకోసం దళిత సామాజిక వర్గానికి చెందిన హోంమంత్రిపైనా వైసీపీ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. 2029లోనే కాదు 2049లోనూ వైసీపీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ప్రస్తుతం ఉన్న 11 సీట్లలో ఒక్క సీటు కూడా రావడం కష్టమేనని అన్నారు. ముస్లిములకు సహా అన్ని వర్గాలకు మేలు కలుగజేసేలా సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

### మంత్రి సవిత పనితీరు భేష్

మంత్రి సవిత పనితీరు భేష్ అంటూ జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశంసలు కురిపించారు. పెనుకొండ నియోజక వర్గంలో అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. కేవలం రెండేళ్ల కాలంలో పెనుకొండ నియోజక వర్గంలో రూ.2,400 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. తన నియోజక వర్గంలోనూ ఈ స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. మంత్రి సవిత పని రాక్షసి అని, ఆమెకు పెనుకొండ వాసులు అండగా ఉండాలని జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని పిలుపునిచ్చారు.అనంతరం పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అంతకుముందు పట్టణంలోని ఇస్లాపురం గ్రామంలో జిల్లా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లను పంపిణీ మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కారక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆర్డీవో ఆనంద రావు , ఇతర అధికారులు, పలువురు ప్రజాప్రనిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ది నానో' నయా దందా.. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం!

ఇంటర్ బోర్డు గుర్తింపు లేదు..

ఫైర్ సేఫ్టీ అసలే లేదు!

అనుమతులు లేకున్నా


లక్షల్లో ఫీజుల దోపిడీ..

జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

మౌనం వెనుక 'రహస్యం' ఏంటి..?

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గారూ..

ఇటు చూడండి!




రంగారెడ్డి / బడంగ్‌పేట్ **(దిక్సూచి ప్రతినిధి):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థలు.. నేడు కాసుల కక్కుర్తితో 'వ్యాపార సామ్రాజ్యాలుగా' మారుతున్నాయి. నూతన విద్యా సంవత్సరం ప్రారంభాన్ని ఆసరాగా చేసుకొని గ్రేటర్ పరిధిలోని కొన్ని ప్రైవేట్ కళాశాలలు అక్రమ సంపాదనకు తెరలేపాయి. ముఖ్యంగా బడంగ్‌పేట్ మున్సిపల్ పరిధిలోని "ది నానో జూనియర్ కాలేజ్" వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. కనీస అనుమతులు లేవు.. నిబంధనల ఊసే లేదు.. కానీ అడ్మిషన్ల పేరుతో లక్షల రూపాయల ఫీజులను దండుకుంటూ విద్యా దందాను యథేచ్ఛగా సాగిస్తోంది. నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### కోళ్లు పెట్టే గూళ్లలాంటి ఇరుకు గదులు.. 300 మంది విద్యార్థులు!

నాదర్‌గుల్‌లోని విజయలక్ష్మీనగర్ కాలనీ వేదికగా ఈ 'నానో' అక్రమ భాగోతం నడుస్తోంది. కేవలం 400 గజాల చిన్న స్థలంలో, గాలి, వెలుతురు సరిగ్గా చొరబడని ఇరుకు భవనాల్లో రెండు క్యాంపస్‌ల పేరుతో కాలేజీ నడుపుతున్నట్లు తెలుస్తోంది.అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు ప్రాణాలు రక్షించుకోవడానికి కనీస నిష్క్రమణ మార్గాలు కూడా ఇక్కడ లేకపోవడం గమనార్హం.

### ఫైర్ సేఫ్టీ సున్నా.. ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

గతంలో జరిగిన పలు అగ్నిప్రమాద ఘటనలు ఎందరో విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న విషయం విద్యాశాఖకు గుర్తుండకపోవచ్చు కానీ.. తల్లిదండ్రులను మాత్రం నిత్యం భయపెడుతూనే ఉంది. 'ది నానో' కాలేజీకి మున్సిపల్ అనుమతులు గానీ, అత్యంత కీలకమైన ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్ (అగ్నిమాపక శాఖ సర్టిఫికేట్) గానీ లేవని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. రేపు ఏదైనా అవాంఛనీయ ప్రమాదం జరిగి విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే.. దానికి బాధ్యత కాలేజీ యాజమాన్యానిదా? లేక మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులదా? అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

### ఇంటర్ బోర్డు గుర్తింపు ఉందా..? కేవలం బోర్డుల ప్రచారమేనా..?

కళాశాల నడపడానికి ఇంటర్మీడియట్ బోర్డు అనుబంధ గుర్తింపు తప్పనిసరి. కానీ, ఈ కాలేజీకి అలాంటి గుర్తింపు పత్రాలు ఏవీ లేవనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కేవలం రంగురంగుల బోర్డులు, ఆకర్షణీయమైన అబద్ధపు ప్రకటనలతో డిస్కౌంట్ల పేరుతో తల్లిదండ్రులను నమ్మించి, అడ్మిషన్లు గుంజుకుంటున్నారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల జీవితాలను పణంగా పెడుతున్నారు.

### అధికారుల మౌనం.. ఫిర్యాదులు బుట్టదాఖలు!

ఈ విద్యా దందాపై స్థానికుల నుంచి, విద్యార్థి సంఘాల నుంచి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి ఫిర్యాదులు అందినప్పటికీ.. ఆయన 'మౌన వ్రతం' వహించడం వెనుక అంతరార్థం ఏమిటి? చిన్నచిన్న నిబంధనల ఉల్లంఘనలకే సీజ్ చేసే అధికారులు.. వందలాది మంది విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న 'ది నానో' కాలేజీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? తనిఖీలు చేయడానికి అధికారుల కాళ్లు ఎందుకు రావడం లేదు?

### కలెక్టర్ గారూ.. విచారణ జరిపించండి!

విద్యార్థుల భవిష్యత్తు, వారి ప్రాణాల రక్షణ దృష్ట్యా రంగారెడ్డి జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఫైర్ సర్వీసెస్ మరియు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. 'ది నానో' కాలేజీపై సమగ్ర విచారణ జరిపి, అనుమతి లేని ఈ కాలేజీని వెంటనే సీజ్ చేయాలని స్థానికులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



పారదర్శకంగా వాస్తవాలను వెల్లడించి, విద్యార్థుల జీవితాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

# మందు మానెయ్ "నాన్నా" పరిశోధనల్లో నమ్మలేని నిజాలు!

**తీవ్ర ప్రభావం చూపుతున్న తండ్రి మద్యం అలవాటు**

**పుట్టబోయే బిడ్డలో తీవ్ర అనారోగ్యం!**

తండ్రి మద్యం అలవాటు పుట్టబోయే బిడ్డపై ప్రభావం చూపుతుందని, పిల్లల్లో శారీరక, మానసిక లోపాలు వస్తాయని పరిశోధనలు చెప్తున్నాయి. ఈ పరిస్థితిని "ఫీటల్ ఆల్కహాల్ స్పెక్ట్రమ్ డిజార్డర్స్(ఎఫ్ఏఎస్‌డీ)" అంటారు. దీనివల్ల పిల్లల్లో ముఖం, దవడల ఆకృతి మారడం, కళ్లు చిన్నవి కావడం తదితర శారీరక సమస్యలు ఉంటాయి. మెదడు ఎదుగుదల మందగించడం, నేర్చుకునే సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు గుండె సంబంధిత లోపాలు, మాటలు ఆలస్యంగా రావడం అందులో లక్షణాలే అని నిపుణులు చెప్తున్నారు.

బిడ్డలు ఏదైనా లోపంతో పుడితే చాలా మంది తల్లిలో లోపాలున్నాయా! అని వెతుకుతుంటారు. కానీ, తండ్రి అలవాట్లకు, బిడ్డ ఆరోగ్యానికి చాలా సంబంధం ఉందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. తాజాగా వెలువడిన పరిశోధనలు బిడ్డకు పుట్టుకతో వచ్చే లోపాలకు తండ్రి మద్యం తాగే అలవాటు ఓ ప్రధాన కారణమని పేర్కొంటున్నాయి.

మద్యం అలవాటు బిడ్డకు ముప్పేనా?

భార్య గర్భధారణకు ముందు భర్తకు మద్యం తాగే అలవాటు ఉంటే పుట్టబోయే బిడ్డకు గ్రహణం మొర్రి, గుండె జబ్బులు, జీర్ణవ్యవస్థ లోపాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చైనాలో జరిగిన పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. దాదాపు 5 లక్షల కంటే ఎక్కువ మంది దంపతులపై ఈ పరిశోధన చేసి ఫలితాలను విశ్లేషించారు. పిల్లలు పుట్టడానికి మూడు నెలల ముందు వారి తండ్రులు రోజుకు 50ఎం.ఎల్. కంటే ఎక్కువ మద్యం తాగితే పిల్లల్లో గుండె సంబంధింత లోపాలు కనిపించాయని పరిశోధకులు గుర్తించారు.

### ఎలా జరుగుతుంది?

మద్యం అలవాటు కారణంగా శుక్రకణాల జన్యువుల పనితీరులో మార్పులు వస్తాయి. శుక్రకణాల లోపల ఉండే ఆర్ఎన్ఏ నిష్పత్తి మారిపోతుంది. దీంతో పిండం సరిగ్గా ఎదగదు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.

### మద్యం జోలికి వెళ్లొద్దు

భార్య గర్భం దాల్చాలని కనీసం కొన్ని నెలల ముందుగానే మద్యం అలవాటుకు దూరంగా ఉండాలి. ఈ చిన్న జాగ్రత్త మన తర్వాతి తరాన్ని సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంచడంలో సహాయపడుతుంది. బిడ్డ అనారోగ్యం విషయంలో కేవలం తల్లులనే బాధ్యులను చేస్తూ వారిపై మానసిక భారాన్ని మోపడం సరికాదు. తండ్రులు కూడా బాధ్యతగా తమ జీవనశైలిని మార్చుకోవాలని పరిశోధకులు, నిపుణులు సూచిస్తున్నారు.

ఎలా నిర్ధారించారు?

తండ్రుల్లో మద్యం అలవాటు పుట్టబోయే బిడ్డపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది? అనే విషయంలో అమెరికాలోని టెక్సాస్ ఏ అండ్ ఎమ్ యూనివర్సిటీ పరిశోధకుడు 'మైఖేల్ గోల్డింగ్' ఎలుకలపై కొన్ని ప్రయోగాలు చేశారు. తల్లి ఎలుకకు గర్భం దాల్చడానికి ముందు తండ్రి ఎలుకకు మద్యం ఇచ్చారు. వాటికి పుట్టిన పిల్లల్లో దవడల ఆకృతి మారడం, కళ్లు చిన్నవిగా అవ్వడం, దంతాల మధ్య సందులు తదితర లక్షణాలు కనిపించాయట. ఇవన్నీ మనుషుల్లో కనిపించే 'ఫీటల్ ఆల్కహాల్ సిండ్రోమ్' లక్షణాలే కావడం గమనార్హం. తండ్రి ఎంత ఎక్కువ తాగితే, పుట్టబోయే పిల్లల్లో అనారోగ్య సమస్యల తీవ్రత అంత ఎక్కువగా ఉంటుందని, మెదడు పనితీరు, నేర్చుకునే సామర్థ్యం కూడా మందగించాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న నిపుణులు పేర్కొంటున్నారు.

### పరిశోధనల మూలాలు :

ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# రక్తమార్పిడి కోసం భారత్ కొత్త ప్రమాణాలు ప్రపంచంలోనే తొలి దేశంగా రికార్డు!

**బ్లడ్ , బ్లడ్ కాంపోనెంట్స్ కోసం "ఫార్మకోపియా"లో**

**కొత్త నియమావళి రక్త మార్పిడిని మరింత సురక్షితంగా**

**మార్చబోతున్న న్యూ చాప్టర్!**



రక్తమార్పిడి విధానంలో భారతదేశం సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసింది. రక్తం నిల్వ, నాణ్యత కోసం కొన్ని ప్రత్యేక నిబంధనలు తెచ్చింది. ఇప్పటి వరకూ ఏ దేశమూ ఇలాంటి ఘనత సాధించలేదు. పైకి చూస్తే ఇది అంత పెద్ద విషయంగా అనిపించకపోవచ్చు, కానీ ఇది చాలా పెద్ద అంశమే. ఇకపై దేశంలో జరిగే ప్రతి రక్తమార్పిడీ, వంద శాతం సేఫ్‌గా జరిగేలా చూడటమే ఈ కొత్త రూల్స్ మెయిన్ టార్గెట్. ఈ నూతన నిబంధనలను "ఇండియన్ ఫార్మకోపియా"లో చేర్చారు.

### "ఫార్మకోపియా" అంటే ?

అసలు "ఫార్మకోపియా" అంటే ఏంటంటే.. ఒక దేశంలో వాడే మందులు, మెడికల్ ప్రొడక్ట్స్ ఎంత క్వాలిటీగా ఉన్నాయో చెక్ చేయడానికి ప్రభుత్వం పెట్టే ఒక అఫీషియల్ రూల్ బుక్ అన్నమాట. మార్కెట్లోకి వచ్చే ఏ మందైనా సరే.. అది ఎంత స్వచ్ఛంగా ఉంది? ఎంత బాగా పనిచేస్తుంది? ఎంతవరకు సేఫ్? ఏ కాంపోనెంట్స్ తో తయారు చేశారు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సైంటిఫిక్ సమాధానాలన్నీ ఇందులో ఉంటాయి. ఎవరైనా మందులను తయారు చేయాలన్నా, అమ్మాలన్నా, సప్లై చేయాలన్నా ఫార్మకోపియాలోని రూల్స్ పక్కాగా పాటించాల్సిందే. అయితే, ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇలాంటి రూల్ బుక్స్ లో కేవలం మందుల నాణ్యత గురించే నమోదు చేసేవారు. రక్తం నాణ్యత గురించి ఏ దేశమూ పట్టించుకోలేదు. కానీ, ఫస్ట్ టైమ్ ఇండియా ఆ పని చేసి చూపించింది. "ఇండియన్ ఫార్మకోపియా-2026" ఎడిషన్ లో ఈ మార్పు చేశారు. ఇప్పటివరకూ కేవలం మందులకే పరిమితమైన ఈ రూల్స్‌ను, ఫస్ట్ టైమ్ రక్తం, రక్త నిల్వలకు కూడా వర్తింపజేస్తూ ప్రత్యేక చాప్టర్స్ చేర్చారు. ఒక దేశం ఇలాంటి ఒక నిర్ణయం తీసుకోవడం ప్రపంచంలోనే ఇది మొదటిసారి అని అధికారులు చెప్తున్నారు. ఈ కొత్త నిబంధనలను ప్రకటించడానికి జూన్ 24న ఘజియాబాద్‌లోని 'ఇండియన్ ఫార్మకోపియా కమిషన్' క్యాంపస్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కొత్త రూల్స్‌ను దేశవ్యాప్తంగా ఉన్న బ్లడ్ బ్యాంక్స్‌లో ఎలా అమలు చేయాలో ఈ భేటీలో చర్చించారు. 6 రాష్ట్రాలకు చెందిన బ్లడ్ బ్యాంక్ నిపుణులు, క్వాలిటీ ఆఫీసర్లు, ప్రభుత్వ హెల్త్ అఫీషియల్స్, లైసెన్స్ ఇచ్చే అధికారులు కలిసి దాదాపు 160 మందికి పైగా ఈ కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

### సురక్షితమైన రక్తమార్పిడే ధ్యేయం :

ఈ సదస్సులో కేంద్ర ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ హర్ష్ మంగ్లా ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రక్తం, రక్త నిల్వల కోసం ఇలాంటి ప్రత్యేక రూల్స్ తీసుకురావడం వైద్యం రంగం సాధించిన పెద్ద మైలురాయిగా పేర్కొన్నారు. ప్రపంచంలో మరే దేశంలోనూ ఇలాంటి రూల్స్ లేవని ఆయన చెప్పారు. దేశంలోని అన్ని బ్లడ్ బ్యాంకులూ ఒకే రకమైన సైంటిఫిక్ నియమాలను పాటించేలా చేయడం, దీని ద్వారా రోగులకు అందే రక్తం క్వాలిటీగా, సేఫ్‌గా ఉండేలా చూడటం దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇండియన్ ఫార్మకోపియా కమిషన్ సెక్రటరీ డాక్టర్ వి. కలైసెల్వన్ మాట్లాడుతూ.. సరికొత్త సైంటిఫిక్ నాలెడ్జ్‌తోపాటు మన దేశీయ, అంతర్జాతీయ రూల్స్‌కు తగినట్లుగా ఈ కొత్త చాప్టర్లను రెడీ చేశామని చెప్పారు. ఈ కొత్త నిబంధనల వల్ల బ్లడ్ బ్యాంకుల నాణ్యత మరింత పెరుగుతుందని, రక్త గ్రహీతలకు పూర్తి భద్రత దొరుకుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### మేధో మథనం :

ఈ సదస్సులో కేవలం కొత్త రూల్స్ గురించే కాకుండా, రక్తం భద్రతకు సంబంధించి ప్రాక్టికల్‌గా ఎదురయ్యే చాలా సమస్యలపై లోతుగా చర్చించారు. రక్తదాన ప్రక్రియలో ప్లాస్మా నాణ్యతను పెంచడం, రక్తాన్ని వృథా చేయకుండా అవసరమైన మేరకే సరిగ్గా వాడటంపై నిపుణులు చర్చించారు. ఈ మార్పులన్నీ సాధారణ రోగులకు పెద్దగా అవసరం లేకపోవచ్చు, వీటి గురించి వారికిపెద్దగా అవగాహన కూడా ఉండకపోవచ్చు.. కానీ, ఈ కొత్త రూల్స్ కారణంగా రక్తం ఎక్కించే ప్రతిసారీ రోగులకు వంద శాతం రక్షణ లభిస్తుంది! అందుకే, భారత్ సాధించిన ఈ ఘనత సామాన్యమైనది కాదని నిపుణులు చెబుతున్నారు.

## నిద్రలో కలవరం, భయమా..

# చెడు కలలకు కారణం తెలుసా?

కలలు రావడం అనేది సహజం. ప్రతి ఒక్కరూ కలలు కంటారు. అయితే కొంత మందికి పదే పదే పీడకలలు, చెడు కలలు వస్తుంటాయి. దీంతో వారు భయాందోళనకు గురి అవుతుంటారు. కాగా, ఇప్పుడు మనం దాని గురించి మనం వివరంగా తెలుసుకుందాం.



కలలు అందరికీ వస్తుంటాయి. కానీ కొన్ని సార్లు కొంత మందికి పదే పదే చెడు కలలు రావడం జరుగుతుంది. దీంతో చాలా మంది ఆందోళనకు గురి కావడం, నిద్రలో కలవరించడం, భయం వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటారు. ఇక అసలు ఇలా పదే పదే పీడ కలలు ఎందుకు వస్తున్నాయని చాలా ఇబ్బంది పడిపోవడమే కాకుండా, మానసిక ఆందోళనకు గురి అవుతున్నారు. కాగా ఇప్పుడు మనం పీడకలల గురించి తెలుసుకుందాం. కలలు అందరికీ వస్తుంటాయి. కానీ కొన్ని సార్లు కొంత మందికి పదే పదే చెడు కలలు రావడం జరుగుతుంది. దీంతో చాలా మంది ఆందోళనకు గురి కావడం, నిద్రలో కలవరించడం, భయం వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటారు. ఇక అసలు ఇలా పదే పదే పీడ కలలు ఎందుకు వస్తున్నాయని చాలా ఇబ్బంది పడిపోవడమే కాకుండా, మానసిక ఆందోళనకు గురి అవుతున్నారు. కాగా ఇప్పుడు మనం పీడకలల గురించి తెలుసుకుందాం. పని ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక పరమైన సమస్యల వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. అయితే కొన్ని సార్లు ఇవి కలల రూపంలో వ్యక్తం అవుతాయంట. అంతే కాకుండా చెడు సంఘటలను, ఊహించని నష్టాలు కూడా కలల రూపంలో వస్తాయి. కాబట్టి ఇటువటి కలలు వస్తే ఆందోళన అవసరం లేదు అని చెబుతున్నారు నిపుణులు. మీకు కాస్త విశ్రాంతి అవసరం అని వాటి అర్థం. పని ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక పరమైన సమస్యల వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. అయితే కొన్ని సార్లు ఇవి కలల రూపంలో వ్యక్తం అవుతాయంట. అంతే కాకుండా చెడు సంఘటలను, ఊహించని నష్టాలు కూడా కలల రూపంలో వస్తాయి. కాబట్టి ఇటువటి కలలు వస్తే ఆందోళన అవసరం లేదు అని చెబుతున్నారు నిపుణులు. మీకు కాస్త విశ్రాంతి అవసరం అని వాటి అర్థం. ఇక చాలా మంది ఈ చెడు కలలు వస్తే ఎక్కువగా ఆందోళనకు గురి అవుతుంటారు. ఏదో జరుగుతుంది. నాకు ఏదో ఆపద రాబోతుంది అని ఎక్కువగా భయపడి పోతుంటారు. అయితే ఇది కేవలం మన మనసులోని ఆలోచనలు మాత్రమే, వీటి వలన ఏదో జరుగుతుంది అనుకోవడం అపోహ.. ఇది భవిష్యత్తును సూచిస్తుంది అని చెప్పలేం అని చెబుతున్నారు నిపుణులు. ఇక చాలా మంది ఈ చెడు కలలు వస్తే ఎక్కువగా ఆందోళనకు గురి అవుతుంటారు. ఏదో జరుగుతుంది. నాకు ఏదో ఆపద రాబోతుంది అని ఎక్కువగా భయపడి పోతుంటారు. అయితే ఇది కేవలం మన మనసులోని ఆలోచనలు మాత్రమే, వీటి వలన ఏదో జరుగుతుంది అనుకోవడం అపోహ.. ఇది భవిష్యత్తును సూచిస్తుంది అని చెప్పలేం అని చెబుతున్నారు నిపుణులు. అంతే కాకుండా ఎక్కువగా నిద్ర పోయేవారు, హర్రర్ మూవీస్ చూసే వారు, సరిగ్గా విశ్రాంతి లేకుండా ఉండే వారు, ఎక్కువగా ఆలోచించే వారికి కూడా ఇలాంటి కలలు వస్తాయని నిపుణులు తెలియజేయడం జరుగుతుంది. అందువలన పదే పదే చెడు కలలు వస్తే అస్సలే భయపడాల్సిన పని లేదంట. అంతే కాకుండా ఎక్కువగా నిద్ర పోయేవారు, హర్రర్ మూవీస్ చూసే వారు, సరిగ్గా విశ్రాంతి లేకుండా ఉండే వారు, ఎక్కువగా ఆలోచించే వారికి కూడా ఇలాంటి కలలు వస్తాయని నిపుణులు తెలియజేయడం జరుగుతుంది. అందువలన పదే పదే చెడు కలలు వస్తే అస్సలే భయపడాల్సిన పని లేదంట.

నోట్ :


ఈ వార్తలలో ఇవ్వబడిన సమాచారం మత విశ్వాసాలపై ఆధారపడి ఉంది. పాఠకుల ఆసక్తి మేరకు.. పలువురు పండితుల సూచనలు, వారి తెలిపిన అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే.. వీటిలో ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పాఠకులు గమనించాలి. టీవీ9 తెలుగు దీనిని ధృవీకరించలేదు

నోట్ :

ఈ వార్తలలో ఇవ్వబడిన సమాచారం మత విశ్వాసాలపై ఆధారపడి ఉంది. పాఠకుల ఆసక్తి మేరకు.. పలువురు పండితుల సూచనలు, వారి తెలిపిన అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే.. వీటిలో ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పాఠకులు గమనించాలి. టీవీ9 తెలుగు దీనిని ధృవీకరించలేదు

## వర్షాకాలంలో మజ్జిగ తాగుతున్నారా?

## అయితే, ఈ విషయం మీరు ఖచ్చితంగా తెలుసుకోవాల్సిందే!



ఎండ తీవ్రత నుండి ఉపశమనం పొందడానికి వేసవిలో మజ్జిగను అమృతంలా తాగుతాం. అయితే వర్షాకాలం రాగానే చాలామంది మజ్జిగ తాగడం పూర్తిగా ఆపేస్తారు. వర్షాకాలంలో మజ్జిగ తాగితే జలుబు, దగ్గు, గొంతు నొప్పి లేదా మోకాళ్ల నొప్పులు వస్తాయనే భయం చాలామందిలో ఉంటుంది. కానీ, ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, వర్షాకాలంలో కూడా మజ్జిగ తాగడం వల్ల శరీరానికి బోలెడంత మేలు జరుగుతుంది. కాకపోతే, ఈ సీజన్‌లో మజ్జిగ తీసుకునేటప్పుడు కొన్ని నియమాలు, జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.

జీర్ణవ్యవస్థ బలోపేతం:

వర్షాకాలంలో మన శరీరంలో జీర్ణక్రియ మందగిస్తుంది. దీనివల్ల పొట్ట ఇన్ఫెక్షన్లు, గ్యాస్, ఎసిడిటీ, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు త్వరగా వస్తాయి. మజ్జిగలో ఉండే లాక్టోబాసిల్లస్ అనే మంచి బ్యాక్టీరియా (ప్రోబయోటిక్స్) జీర్ణవ్యవస్థను చురుగ్గా ఉంచి, పొట్టను ఆరోగ్యంగా ఉంచుతుంది. హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) తో బాధపడేవారు రోజూ మజ్జిగ తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. జీర్ణవ్యవస్థ బలోపేతం: వర్షాకాలంలో మన శరీరంలో జీర్ణక్రియ మందగిస్తుంది. దీనివల్ల పొట్ట ఇన్ఫెక్షన్లు, గ్యాస్, ఎసిడిటీ, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు త్వరగా వస్తాయి. మజ్జిగలో ఉండే లాక్టోబాసిల్లస్ అనే మంచి బ్యాక్టీరియా (ప్రోబయోటిక్స్) జీర్ణవ్యవస్థను చురుగ్గా ఉంచి, పొట్టను ఆరోగ్యంగా ఉంచుతుంది. హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) తో బాధపడేవారు రోజూ మజ్జిగ తాగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. రోగనిరోధక శక్తి పెంపు: వర్షాకాలంలో బ్యాక్టీరియా, వైరస్ల వల్ల వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తాయి. మజ్జిగను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) పెరిగి, ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యం లభిస్తుంది. దీంతో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. క్రమం తప్పకుండా మజ్జిగ తాగడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తి పెంపు: వర్షాకాలంలో బ్యాక్టీరియా, వైరస్ల వల్ల వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తాయి. మజ్జిగను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) పెరిగి, ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యం లభిస్తుంది. దీంతో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. క్రమం తప్పకుండా మజ్జిగ తాగడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరానికి అవసరమైన పోషకాలు: మజ్జిగలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలోని ఎలక్ట్రోలైట్ల సమతుల్యతను కాపాడుతుంది. ఇందులో క్యాల్షియం, విటమిన్ దీ కాంప్లెక్స్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి వర్షాకాలంలో వచ్చే నీరసాన్ని తగ్గించి శరీరానికి శక్తిని ఇస్తాయి. .ముఖ్యంగా వయసు పైబడిన వారిలో వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను ఇది నివారిస్తుంది. శరీరానికి అవసరమైన పోషకాలు: మజ్జిగలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలోని ఎలక్ట్రోలైట్ల సమతుల్యతను కాపాడుతుంది. ఇందులో క్యాల్షియం, విటమిన్ దీ కాంప్లెక్స్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి వర్షాకాలంలో వచ్చే నీరసాన్ని తగ్గించి శరీరానికి శక్తిని ఇస్తాయి. .ముఖ్యంగా వయసు పైబడిన వారిలో వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను ఇది నివారిస్తుంది. వర్షాకాలంలో మజ్జిగ వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రాకూడదంటే కింది జాగ్రత్తలు పాటించాలి. ఈ సీజన్‌లో మజ్జిగను ఉదయం పూట లేదా మధ్యాహ్నం భోజనం తర్వాత మాత్రమే తీసుకోవాలి. సాయంత్రం 5 గంటల తర్వాత లేదా రాత్రి వేళల్లో మజ్జిగ తాగడం వల్ల కఫం పెరిగి, జలుబు, దగ్గు లేదా గొంతు ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. అలాగే, ఫ్రిజ్‌లో పెట్టిన లేదా ఐస్ వేసిన చల్లటి మజ్జిగను అస్సలు తాగకూడదు. ఎల్లప్పుడూ గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న తాజా మజ్జిగను మాత్రమే తాగాలి. వర్షాకాలంలో మజ్జిగ వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రాకూడదంటే కింది జాగ్రత్తలు పాటించాలి. ఈ సీజన్‌లో మజ్జిగను ఉదయం పూట లేదా మధ్యాహ్నం భోజనం తర్వాత మాత్రమే తీసుకోవాలి. సాయంత్రం 5 గంటల తర్వాత లేదా రాత్రి వేళల్లో మజ్జిగ తాగడం వల్ల కఫం పెరిగి, జలుబు, దగ్గు లేదా గొంతు ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. అలాగే, ఫ్రిజ్‌లో పెట్టిన లేదా ఐస్ వేసిన చల్లటి మజ్జిగను అస్సలు తాగకూడదు. ఎల్లప్పుడూ గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న తాజా మజ్జిగను మాత్రమే తాగాలి. మజ్జిగ చలవ చేసే గుణాన్ని సమతుల్యం చేయడానికి అందులో కొద్దిగా జీలకర్ర పొడి, కొత్తిమీర, నల్ల ఉప్పు, చిన్న అల్లం ముక్క లేదా సొంఠి పొడి కలిపి తీసుకోవాలి. ఇవి జీర్ణక్రియను మరింత వేగవంతం చేస్తాయి. వర్షాకాలంలో ఎక్కువ రోజులు నిల్వ ఉండి, పులిసిపోయిన మజ్జిగను తాగకూడదు. ఇది గొంతు నొప్పికి దారితీస్తుంది. కేవలం తాజా పెరుగుతో చేసిన మజ్జిగనే ఎంచుకోవాలి. వాతావరణంలో మార్పులు ఉన్నప్పటికీ, సరైన పద్ధతిలో, సరైన సమయంలో తీసుకుంటే వర్షాకాలంలో కూడా మజ్జిగ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815